క్లుప్తంగా

దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

గుంటూరు రూరల్: దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు గ్రామానికి చెందిన ఆళ్ళ మోహనరావు ఇంట్లో అద్దెకు నివసించే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఇంటిబయట పార్క్ చేసి ఇంట్లోకి వెళ్ళాడు. అదే అదనుగా భావించిన దొంగ బైక్‌ను దొంగిలించేందుకు ప్రయతి్నంచగా స్థానికులు గుర్తించి అతనిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వామినాథన్ కృషితోనే ఆహారభద్రత

తెనాలి: దేశంలో పెరుగుతున్న జనాభాకు కావాల్సిన ఆహారధాన్యాలను ముందుగానే అంచనా వేసి, ప్రభుత్వాల సహకారంతో తగిన ప్రణాళికలతో సాధించిన హరిత విప్లవ కారుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విచారం వ్యక్తం చేశారు. దేశంలో ఆహార భద్రత ఆ మహనీయుడి కృషివల్లనే సాధ్యమైందని గురువారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు, ఈ రంగంపై ఆధారపడిన ఎందరో బడుగు, బలహీనవర్గాల ప్రజల జీవనప్రమాణాలు పెరుగుదలకు స్వామినాథన్ సిఫార్సులను అమలుచేసి ప్రభుత్వాలు తోడ్పడాలని సూచించారు. అప్పుడే స్వామినాథన్‌కు నిజమైన నివాళి అర్పించినట్టు కాగలదని స్పష్టంచేశారు.

మాల ఐక్యసేవ సమితి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడిగా రత్నరాజు

నెహ్రూనగర్: మాల ఐక్యసేవ సమితి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడిగా డేనియల్ రత్నరాజు నియమితులయ్యారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో గురువారం సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు రత్నరాజుకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల ఐక్య సేవా సమితి ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేశం సునీల్ ప్రకాష్, మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర సలహాదారు కొండపల్లి విల్సన్, చిన్నం డేవిడ్ విలియమ్స్, జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల భాగ్యరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కల వర ప్రసాదరావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం

లక్ష్మీపురం: లాలుపురం ఫొటోగ్రాఫర్ డి.శంకర రావుకు ప్రతిష్టాత్మక ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ప్రతిభా పురస్కారం, గోల్డ్ మెడల్ దక్కింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం నిర్వహించిన వరల్డ్ టూరిజం డే సెలబ్రేషన్స్‌లో ఆయనకు అడిషనల్ సీసీఎల్‌సీ కం సెక్రటరీ, సీఈవో ఆఫ్ సెర్ప్ ఎండీ ఇంతియాజ్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్, రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఫౌండర్ చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్. వెంకటరమణ పాల్గొన్నారు.

చిట్టీ డబ్బులు అడిగినందుకు దాడి

పట్నంబజారు: చిట్టీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీలాల్‌నగర్‌కు చెందిన ఆంజనేయులు, సాంబయ్య వద్ద రూ.లక్ష చిట్టీ వేశాడు. అది పూర్తయినప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో అడిగేందుకు వెళ్లాడు. దీంతో సాంబయ్య, అతని కుటుంబ సభ్యులు ఆంజనేయులుపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

పట్నంబజారు: వ్యక్తిపై దాడిచేసి నగదు లాక్కున ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన చంటి వినాయక నిమజ్జనం నిమిత్తం పూల కోసం బుధవారం రాత్రి మార్కెట్‌కు వచ్చాడు. పూలు లేకపోవడంతో బస్టాండ్ వద్ద టీ తాగేందుకు వచ్చి నిలబడి ఉన్నాడు. ఈ క్రమంలో రౌడీషీటర్ ఆబేలు, అనిల్ అక్కడకు వచ్చి చంటితో పాటు, మరో యువకుడిపై దాడిచేసి గాయపరిచి వారి వద్ద ఉన్న రూ. 1100తో పాటు సెల్‌ఫోన్ తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుల్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

గణేష్ ఊరేగింపులో ఘర్షణ

గుంటూరు ఈస్ట్: గణేష్ ఊరేగింపు సమయంలో ఏర్పడిన వివాదంలో ఒక వర్గం కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటెపాడు హనుమయ్యనగర్‌లో బుధవారం రాత్రి గణేష్ విగ్రహం ఊరేగింపు వెళుతోంది. డీజే సౌండ్స్ ఎక్కువగా ఉండటంతో సమీపం ఓ ఇంట్లోని ఫిరోజ్‌ఖాజీ, మదనార్ ఖాజీ, హనీఫ్ ఖాజీ ఊరేగింపుగా వెళుతున్న వారితో గొడవ పడ్డారు. ఊరేగింపులోని బాబ్ జాన్, అనిల్, సాగర్, మురళి, మరో ఇద్దరు ఇంట్లోని ముగ్గురిని కొట్టి సామాన్లు ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీల ఎగనామం.. కార్పొరేషన్ ఖజానాకు నష్టం

- నగరంలో విచ్చలవిడిగా అనధికార హోర్డింగ్స్, బోర్డులు
- నగరపాలక సంస్థకు కోట్లాది రూపాయల నష్టం
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో హోర్డింగ్స్, బోర్డుల నిర్వాహకులు కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. బకాయిలు చెల్లించకుండా దర్జాగా కాలం వెళ్లదీస్తున్నారు.

బకాయిలు ఇలా...

2017 – 2022 ఆర్థిక సంవత్సరం వరకు హోర్డింగ్స్, బోర్డుల నిర్వాహకులు నుంచి వసూలు చేయాల్సిన బకాయిలు రూ. 1,53,42,553 కోట్లు ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.6,72,09,480 కోట్లు డిమాండ్ కాగా రూ.2,98,09,677 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ. 3,73,99,803 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని మొండి బకాయిల్ని వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఒక ఏజెన్సీ నిర్వాహకుడు రూ.50లక్షలు బకాయి ఉంటే అతడు సదరు బోర్డులు, హోర్డింగ్స్‌ను వేరే ఏజెన్సీకి అమ్మేసుకుంటాడు. దీంతో బకాయి ఉన్న ఏజెన్సీ నిర్వాహకులు అధికారుల్ని మేనేజ్ చేసుకుని ఎగనామం పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు గట్టిగా యాక్షన్ తీసుకుంటే మొండి బకాయిలు సైతం వసూలు చేయగలరు గానీ, ఆ దిశగా అడుగులు వేయడం లేదనే చెప్పుకోవచ్చు.

కౌన్సిల్ సమావేశాల్లోనూ రచ్చరచ్చ

హోర్డింగ్స్, బోర్డుల నిర్వహణ వల్ల కోట్ల రూపాయిలు నగరపాలక సంస్థకు బకాయిలు ఉన్నాయని, వసూలు చేయడంలో పట్టణ ప్రణాళిక అధికారులు విఫలం అయ్యారని పలువురు కార్పొరేటర్లు గత కౌన్సిల్ సమావేశాల్లో ఆరోపించారు. కొంత మంది అధికారులు ఏజెన్సీలతో కుమ్మక్కయి బకాయిలు వసూలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ప్రతి ఏడాది ఇంత మంది ఏజెన్సీలకు కాకుండా నగరం మొత్తం మీద హోర్డింగ్స్ నిర్వహణకు ఒక టెండర్ ప్రక్రియ పెడితే నగరపాలక సంస్థకు ఆదాయంతో పాటు, అనధికార హోర్డింగ్స్ సమస్య తీరుతుందని పలువురు కార్పొరేటర్లు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

టాప్ ప్రయారిటీ ప్లేస్‌ల అమ్మకం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో టాప్ ప్రయారిటీ ప్లేస్‌లు అయిన నాజ్ సెంటర్, మార్కెట్ సెంటర్, బ్రాడీపేట, లక్ష్మీపురం, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో హోర్డింగ్, బోర్డులను టౌన్ ప్లానింగ్ అధికారులు అమ్మేసుకుంటూ అటు వైపు తమ సిబ్బందిని కన్నెత్తి చూడొద్దు అంటూ హుకుం జారీ చేసిన సంఘటనలు లేకపోలేదు. దీని వల్ల కార్పొరేషన్ ఆదాయం రాకపోగా టౌన్ ప్లానింగ్ అధికారుల జేబులు నింపుకుంటున్నారని, సిండికేట్‌గా మారి యాడ్ ఏజెన్సీలు నిర్వహించుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికార లెక్కల ప్రకారం హోర్డింగ్స్, బోర్డులు నగరంలో అధికారికంగా 200 ఉన్నాయని చెబుతున్నప్పటికీ,అనధికారికంగా వందలబోర్డులు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

14 సంవత్సరాల తరువాత పెంచిన ఫీజులు

హోర్డింగ్స్, బోర్డులు నిర్వహణకు 2008 గెజిట్ ప్రకారం ఫీజులు వసూలు చేసేవారు. అయితే, 14 ఏళ్లుగా పెంచకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకుల జేబులు నిండుకున్నాయనే చెప్పుకోవచ్చు. పాత గెజిట్‌కు ఫుల్‌స్టాప్ పెడుతూ గత ఏడాది ఆగస్టు 8న కొత్త గెజిట్ మేరకు ఫీజులు వసూలు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఫీజుల పెంపుపై కొంత మంది ఏజెన్సీ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించడంతో బకాయిలు కోట్ల రూపాయల్లో పెండింగ్‌లో పడ్డాయి.

బకాయిలు వసూలు చేస్తాం

2022 ఆగస్టులో నూతన గెజిట్ ప్రకారం ఫీజులు వసూలు చేయాలని ఆదేశాలు రావడంతో ఆ దిశగా ఫీజులు కట్టాలని ఏజెన్సీలకు నోటిసులిచ్చాం. దీనిపై కొంతమంది కోర్టును ఆశ్రయించారు. కోర్టులో ఈ విషయం పెండింగ్‌లో ఉండటం వల్ల ఏజెన్సీ నిర్వాహకులు బకాయిలు చెల్లించడం లేదు. ఏజెన్సీలతో ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు ఏర్పాటు చేశాం. కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ బకాయిలు చెల్లించాలని చెప్పాం. మిగిలిన బకాయిలు కూడా వసూలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

– పి.ప్రదీప్‌కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి, నగరపాలక సంస్థ

బాల్యంలోనే గవర్నర్ల ప్రశంసలు స్ఫూర్తిదాయకం

ఆర్‌జేడీ సుబ్బారావు



గ్రీష్మ శ్రీ, తహసీన్‌లను సత్కరిస్తున్న ఆర్‌జేడీ సుబ్బారావు, కుముదీన్ సేన్, పార్వతి

పొన్నూరు: కూచిపూడి నృత్యంలో ప్రతిభను చాటి కర్ణాటక, హరియాణ రాష్ట్ర గవర్నర్ల ప్రశంసలు అందుకున్న తెనాలి ప్రైవేటు పాఠశాలల విద్యార్థినులు గ్రీష్మ శ్రీ (7), తహసీన్ (11)లను సత్కరించడం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సుబ్బారావు అన్నారు. పొన్నూరు మండలం గోళ్లమూడిపాడులోని నాట్కో శిక్షణ పాఠశాలలో గురువారం జరిగిన దక్షిణ భారత ప్రాంతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ గస్తీ నాయకుల విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రీష్మ శ్రీ , తహసీన్ కూచిపూడి నృత్యం ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం గ్రీష్మ శ్రీ , తహసీన్‌లను ఆర్‌జేడీ సుబ్బారావు సత్కరించి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ డైరెక్టర్ పయ్యావుల పార్వతి, స్కౌట్స్ అండ్ గైడ్స్ డైరెక్టర్ కుముదీన్ సేన్, తెనాలి ఉప విద్యాశాఖాధికారి ఎం.నిర్మల, తెనాలి మండల విద్యా శాఖాధికారి లక్ష్మీ నారాయణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య వెల్‌నెస్ క్యాంప్



తక్కెళ్ళపాడులో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య క్యాంపులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సౌజన్య

పెదకాకాని: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య వెల్‌నెస్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద డాక్టర్ పి.సౌజన్య అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు ఎస్టీ కాలనీలో గురువారం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య వెల్‌నెస్ క్యాంప్ ఏర్పాటు చేశారు. నంబూరు కాళీగార్డెన్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్ ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సౌజన్య రోగులకు వైద్యసేవలు అందించారు. గ్రామంలోని 87 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన క్యాంపు ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేని వైద్యసేవలు పొందాలని ప్రజలకు సూచించారు. ఈ క్యాంపులో ఆయుర్వేద ఆసుపత్రి వైద్య సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, ఎస్‌డీ కరీం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెదనందిపాడు: నవయుగ కవి చక్రవర్తి సమాజంలోని మూఢ విశ్వాసాలపై తన కవితా ఖడ్గాన్ని సంధించాడని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు అన్నారు. గురువారం తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన గేరా మోహన్‌రావు మాట్లాడుతూ జాషువా హేతువాది అని, సామాజిక చైతన్య కవి అని, నేను దళిత కవిని కాదు ప్రజల కవినని జాషువా పేర్కొన్నాడని ఆయన చెప్పారు. తన కవిత్వం ద్వారా శ్రామిక వర్గం పక్షాన నిలబడి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్, దేవరకొండ శ్రీనివాసరావు, కొత్త శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



పొన్నూరు: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పొన్నూరు మండలంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. గురువారం గుంటూరు కృష్ణనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించి పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు ఆదిశేషులు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. అంకితభావంతో పనిచేసి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిశేషులు అన్నారు. కార్యక్రమంలో పొన్నూరు మండల, పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తాం

తాడేపల్లిరూరల్: మహిళల అభివృద్ధి కోసం ఎంబీవీకే ట్రస్ట్ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని ట్రస్ట్ చైర్మన్ పి.మధు అన్నారు. గురువారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో జరుగుతున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కుట్టు శిక్షణలో ఉన్న మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలంతా పట్టుదలగా కుట్టు శిక్షణ నేర్చుకోవాలన్నారు. శిక్షణ నేర్చుకుని కుటుంబంలో ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు చేదోడు వాదోడుగా ఉండాలని కోరారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పి. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి బ్యాచ్‌లో కొంతమందికి శిక్షణ ఇస్తున్నామని, ఈ బ్యాచ్ ముగియగానే రెండో బ్యాచ్‌కు శిక్షణ మొదలు పెడతామని అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారావు, ట్రైనర్ ఎస్‌కె నాగుర్ బీ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే సిబ్బంది లక్ష్యం



విద్యుత్‌లైనును రిపేరు చేస్తున్న లైన్‌మెన్ బాలు నాయక్

పెదనందిపాడు: గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూసి వారికి మెరుగైన విద్యుత్ సేవలు అందించటమే విద్యుత్ శాఖ సిబ్బంది లక్ష్యమని ఆ శాఖ ఏఈ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, గాలుల ధాటికి చాలా చోట్ల చెట్లు గాలి తీవ్రతకు విద్యుత్ తీగలపై పడటం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. గురువారం మధ్యాహ్నం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో స్థానిక లైన్‌మెన్ బాలునాయక్ లైను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని ఆయన తెలియజేశారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ సదస్సు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తెలిపారు. గురువారం నగరంలోని కృషి భవన్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులు, శాస్త్రవేత్తలకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. తిమ్మాటిక్ లీడ్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ మెంటర్స్, ఫార్మర్ సైంటిస్టులందరు తమ యొక్క పొలాల్లో ప్రయోగాలు చేసి డేటా తీసుకోవాలన్నారు. దీనివల్ల పూర్తి స్థాయిలో ప్రయోగాలు చేయవచ్చన్నారు. డేటాను ఏ విధంగా సేకరించాలో తెలిపారు. పీఆర్‌సీ వెంకటరావు మాట్లాడుతూ ఏడాది పొడవునా నేలను కప్పి ఉంచడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందన్నారు. అన్ని పంటలలో దేశీ రకాల విత్తనాలు వాడాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమిలో మైక్రోబ్స్ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రమ్య, టీపీపీ ఇర్ఫాన్, డీపీపీలు సుస్మిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు భగవంతుని ఆశీస్సులు

శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



నిమజ్జనోత్సవంలో సిద్ధార్థరెడ్డి

పాత గుంటూరు: భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రజలకు ఉండాలని, ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పైనా ఉండాలని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆకాంక్షించారు. గుంటూరువారితోటలో అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన గణేశ్ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేశ్ నిమజ్జనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ ఢిల్లీలో ఎందుకున్నాడో ప్రజలకు తెలుసన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని తెలిపారు. చంద్రబాబు చేసిన అన్ని స్కాముల్లో స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం అతి చిన్నదని చెప్పారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందు టీడీపీకి అనుకూలమో, వ్యతిరేకమో చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు 80 శాతం మంది టీడీపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ చేసిన మంచి కార్యక్రమాలే ఆయన్ను గెలిపిస్తాయనే విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలి



పట్నంబజారు: ప్రజల సమస్యల్ని అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు.ఆటోనగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్లకు మరమ్మతులు చేయకపోవడతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక వ్యాపారులు, ప్రజలు ఆమె దృష్టికి తీసుకు రావడంతో గురువారం ఆమె ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీ ఐసీసీ అధికారులతో మాట్లాడారు. పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు అధికంగా ఉండే ఆటోనగర్‌లో సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నాబార్డు డీడీఎం శరత్‌బాబు



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సెయింట్ పాల్స్ ఆడిటోరియంలో గురువారం రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకులో తమ పొదుపును దాచుకోవాలని చెప్పారు. అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు, గొలుసు కట్టు కంపెనీలు మాయలో పడవద్దని తెలిపారు. బ్యాంకులో నగదు తీసుకుంటే సులభ వాయిదాలలో చెల్లించవచ్చని ఎక్కువ వడ్డీలకు ఆశపడి ఆర్థికంగా నష్టపోవద్దని చెప్పారు. ఎక్కువ వడ్డీలకు ప్రైవేట్ సంస్థల్లో నగదు తీసుకోవద్దన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, రఘురామయ్య, అవార్డు సంస్థ సెక్రటరీ రమణయ్య, సర్పంచ్ డి.మెల్కియా, రైతులు పాల్గొన్నారు.

తాగునీరు రంగు మాత్రమే మారింది..కలుషితం కాలేదు

నగర కమిషనర్ యు శారదాదేవి

మంగళగిరి: పట్టణంలో సరఫరా అవుతున్న తాగునీరు రంగు మారిందే కాని ఎలాంటి కలుషితం కాలేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర కమిషనర్ యు శారదాదేవి పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో గురువారం కమిషనర్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా మున్సిపల్ నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని విమర్శలు వెల్లువెత్తాయని, స్పందించిన అధికారులు నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారని తెలిపారు. ల్యాబ్ నివేదికలలో తాగునీరు కలుషితం కాలేదని తేలిందని చెప్పారు. కలుషిత తాగునీరు సరఫరా చేస్తున్నారనే అపోహలను ప్రజలు నమ్మకుండా వినియోగించుకోవచ్చన్నారు. వాతావరణ మార్పులు, సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు వచ్చే అవకాముందన్నారు. సీజనల్ వ్యాధులు వైరల్ జ్వరాలు వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో చికిత్స తీసుకుని తగిన మందులు వాడాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా నీటిని కాచి చల్లార్చి తాగడంతోపాటు నీటిపాత్రలపై ఎప్పుడూ మూతవేసి ఉంచాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రైనేజిలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు.

క్యాన్సర్ చికిత్సకు రూ. 6 లక్షలు ఆర్థిక సాయం

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గురువారం రూ. 6 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. నగరంలోని ప్రగతీనగర్‌లో నివసిస్తున్న రహంతుల్లా అద్దె ఇంట్లో ఉంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి ఐదు నెలల కిందట క్యాన్సర్ సోకింది. చికిత్సకు ఆర్థిక సాయం అందించాలంటూ రహంతుల్లా కుమార్తె కోవిడ్ ఫైటర్స్ సభ్యుల్ని సంప్రదించింది. దాతల సహాయంతో విరాళాలు సేకరించి రూ. 6 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు.

రూ. 50వేలు అందించిన మైనార్టీ సెల్ చైర్మన్

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆటోడ్రైవర్ రహంతుల్లాకు వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ చైర్మన్ ఖాదర్‌బాషా రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. విరాళాలు సేకరించేందుకు ఆయన్ను కలవడంతో స్పందించి మొట్టమొదటిగా రూ. 50వేలు అందించారని కోవిడ్ ఫైటర్స్ సభ్యులు చెప్పారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరాలు

గుంటూరు మెడికల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా లలితా హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లలితా గ్రూఫ్ ఆఫ్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 500 మంది వినియోగించుకున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజలందరికీ గుండె జబ్బుల గురించి అవగాహన కల్పించడానికి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29ని వరల్డ్ హార్ట్‌డే గా ప్రకటించిందని మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.వి.రాఘవ శర్మ తెలిపారు.

మోహనార్జున హాస్పిటల్‌లో...

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.జి.మోహనార్జున్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని మోహనార్జున హాస్పిటల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అన్నదానం పుణ్యకార్యం

నెహ్రూనగర్: అన్నదానం పుణ్యకారంతో సమానమని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీనివాసరావుపేట, సంగడిగుంట రెడ్ల బజార్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల్లో భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, సంకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మన భూమి-మన దేశం' ర్యాలీ

తెనాలి: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ఇచ్చిన పిలుపు 'మేరా మిట్టి–మేరా దేశ్' ప్రకారం స్థానిక అయితానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా 50 మంది విద్యార్థులు వస్త్రధారణ చేశారు. వీరిలో కొందరు కోయబృందాలుగా, మరికొందరు శాంతికి చిహ్నమైన తెల్లని వస్త్రాలను ధరించారు. అంతా కలిసి మట్టి కలశాలను చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు తీన్‌మార్, డ్రమ్ముల మోతలతో నినాదాలు మారుమోగించారు. తొలుత ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ నేతృత్వంలో విద్యాకమిటీ చైర్మన్ రాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ పర్యవేక్షించారు. మన భూమి–మన దేశం రెండు కళ్లుగా ఆయన చెప్పారు. భూమి లేకపోతే మనిషి మనుగడే లేదన్నారు.